విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

దళిత నేత, మాజీ మంత్రి జవహర్‌కు అవమానం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డీ నజీర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : దళిత నాయకుడు, మాజీ మంత్రి జవహర్‌ను పోలీస్ స్టేషన్లో క్రింద కూర్చోబెట్టి పోలీసులు అవమానించారని తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనపర్తిలో చంద్ర బాబును అక్రమంగా అడ్డుకున్నారని ప్రశ్నిస్తే మాజీ మంత్రి జవహర్, ఇతర దళిత నేతలతో అమర్యాదగా ప్రవర్తించి, అక్రమ అరెస్టు చేసారని పోలీసులపై ధ్వజమెత్తారు. పోలీస్ స్టేషన్ లో క్రింద కూర్చో పెట్టి సీనియర్ దళితనేత,మాజీ మంత్రిని ఘోరంగా అవమానించారని నజీర్ ఆగ్రహం వ్యక్తం చేసారు.జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు న్నరేళ్లలో దళితులు, మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, దళితులకు అండగా ఉంటానని కల్లిబొల్లి కబుర్లు చెప్పటమే ముఖ్యమంత్రికి చేతన య్యిందని నజీర్ ఎద్దేవా చేసారు. రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు ప్రభుత్వ వైఖరి గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నజీర్ వ్యాఖ్యానించారు.

రాజకీయ విలువలకు నిలువుటద్దం మాజీ ఎమ్మెల్యే కోడిగంటి గోవిందరావు

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర - అనకాపల్లి : నీతి, నిజాయితీకి, నైతిక విలువలకు, నిలువెత్తు నిలువటద్దంగా మాజీ ఎమ్మెల్యే కోడిగంటి గోవిందరావు చరిత్రలో నిలుస్తారని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ కొనియాడారు. కామ్రేడ్ కోడిగంటి గోవిందరావు 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ లోని ఆయన విగ్రహం వద్ద సిపిఐ జోనల్ కార్యదర్శి వై ఎస్ భద్రం అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా గోవిందరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగాబాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యంగా విలువలతో కూడిన రాజకీయాలు నడిపిన గోవిందరావు చిరస్మరణీయుడిని, సాగు నీటి వనరుల కోసం పోలవరం ప్రాజెక్టు సాధన కోసం తను చివరి వరకు పోరాడి సాధించారన్నారు .అలాగే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం తన ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసిన ధన్యజీవని కొనియాడారు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని జైలు శిక్షణను అనుభవించిన సమరయోధుడిని, ఆయన బాటలో నేటి తరం కమ్యూనిస్టులు నడిచినప్పుడే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. తొలుత ఆయనతో కలిసి ఉద్య మంలో పని చేసినసీనియర్ కమ్యూనిస్టు కురువృద్ధురాలు శ్రీమతి బుద్ధ మంగయమ్మ గోవిందరావు విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ దొరబాబు, కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు ,మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు ,తాకాశి వెంకటేశ్వర రావు, ఎంఏ మాధవ రావు, కోరుబిల్లి శంక ర్రావు, శ్రీరామదాసు అబ్బులు, కే.వీరాచారి తదితరులు మాట్లాడారు ఈ సమావేశంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ నాయకులు బూసి రాజు, కనిశెట్టి సురేష్ బాబు, గాడి బాలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కోన లక్ష్మణ పలు కార్మిక సంఘాల నాయకులు, జేరిపోతుల దుర్గారావు, కరణం మాణిక్యాలరావు వాసు, అంది పోయిన అప్పలరాజు, రెడ్డి రంగారావు, కేవీస్ రాజు, ముక్కామల చిన్ని శ్వరరావు అంబికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : బాలేపల్లి

విశాలాంధ్ర - కే కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఈ ప్రాంతానికి జీవనాడి అని అటువంటి ప్రాజెక్టుపై ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. కే.కోటపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టుకు ఒక నయా పైసా కూడా కేటాయించలేదని అన్నారు. విశాఖపట్నం విజయనగరం శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు ఎనిమిది లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 1500 గ్రామాలకు త్రాగునీటి సదుపాయం, 4.74 టిఎంసిల నీటిని పరిశ్రమలకు అందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఈ ప్రాంత మంత్రులు ఎమ్మెల్యేలు పట్టించుకోక పోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రాజెక్టుల పురోగతిని పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీఈనెల 22వ తేదీన భూదేవి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలిస్తారని అన్నారు. అనంతరం బాలేపల్లి వెంకటరమణ భూదేవి రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు, రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి క్షేత్ర పాలకుడు బాల త్రిపురాంతక, కాశీ విశ్వేశ్వర ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్దఎత్తున శివాలయాలకు పోటెత్తారు. జగాలను ఏలే జంగమ దేవుడు, తినేత్రుడు, లింగాకార రూపుడైన శివునికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తెల్లవారుఝాము నుంచే భక్తులు పోటెత్తారు. అన్ని శివాలయాలలో ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు.

గిరిజన పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత అన్న ప్రసాదాలు పంపిణీ

విశాలాంధ్ర - పాడేరు : స్థానిక గిరిజన పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో శివ భక్తులకు శ్రీశ్రీశ్రీ మత్స్య లింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో, అద్దుమండ మత్స్య లింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. పాడేరు ఉమా నీలకంఠేశ్వర ఆలయంలో తుమ్మరమెట్ట, ఈరడా పల్లి పలుచోట్ల సాకారాలు అందించారు. మత్స్యగుండంలో సబ్ కలెక్టర్ అభిషేక్ పాల్గొని గిరిజన పాత్రికేయుల సేవలను అభినందించారు. స్థానిక సిఐ సుధాకర్ పోలీస్ రెవెన్యూ అధికారులు ఆలయ కమిటీ పంచాయతీ సర్పంచ్ తదితరులు గిరిజన పాత్రికేయులు అందిస్తున్న సేవలను అభినందించి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సూర్యారావు పాడేరు మండల అధ్యక్షులు రాజారావు కార్యదర్శి రామచంద్రారావు గౌరవ అధ్యక్షులు దేముడు బాబు, వెంకటరమణ, సంఘ నాయకులు సునీల్ కుమార్, మహేష్, జోషి, దుర్గారావు, మత్స్య లింగం, ఆనందు, పండు, నాగరాజు, చిట్టిబాబు, కొండబాబు పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ క్రికెట్ కోచ్ కృష్ణారావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గాజువాక సిటీ : పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సీనియర్ క్రికెట్ కోచ్ కృష్ణారావ్ (గాంధీ) జన్మదినం సందర్భంగా గాజువాక సీనియర్ క్రికెటర్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు, జింక్ మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మరియు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సమక్షంలో కేక్ కట్ చేసి ఆయనను ఘనంగా సత్కరిన్చారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏంతో మంది యువతకు క్రికెట్ లో శిక్షణ నిస్తూ వారిని మరిన్ని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో కృష్ణారావు కీలక పాత్ర పోషి స్తున్నారని, క్రీడలు మానసిక ఒత్తిడిని జయించే శక్తిని మరియు శారీరక మానసిక ఉల్లాసాన్ని పెంచు తాయని 40 సంవత్సరాల వయసులో కూడా ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న గాజువాక సీనియర్ క్రికెటర్లు యువతకు ఆదర్శమని వారి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసలు కురిపించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ కసిరెడ్డి నూకరాజు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యన్నారాయణ, వీడిసీపీ జాయింట్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీను మరియు క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర - నాతవరం : నాతవరం మండలం నాతవరం, గునుపూడి గ్రామాల్లో బిజెపి రాష్ట్ర మహాసంపర్క్ అభియాన్ కన్వీనర్ గాదే శ్రీనివాసరావు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి అభ్యర్థి పివిఎస్.మాధవ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఆరు సంవత్సరాలలో మాధవ్ విశాఖ రైల్వేజోన్, పాడేరు గిరిజన మెడికల్ కళాశాల, ఉత్తరాంధ్ర చక్కెర కర్మాగారాలు మెరుగుపరిచే విధంగా, ఇతర పరిశ్రమలుగా మార్చేందుకు కృషి చేశారన్నారు. దేవాలయాల పరిరక్షణ, సింహాచలం క్షేత్రం అభివృద్ధికి ప్రసాద పథకం కింద రూ.59 కోట్ల కేంద్రం మంజూరు, ఏటికొప్పా బమ్మలక, విజయనగరం జిల్లా మామిడి తాండ్ర, శ్రీకాకుళం జిల్లా పొందూరు వస్త్రాల ద్వారా దేశవ్యాప్త గుర్తింపు ఉద్యోగలక పాత పెన్షన్ విధానం, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రాంతాలను స్మారక స్ఫూర్తి కేంద్రాలుగా గుర్తించి రూ.5 కోట్లు మంజూరు చేయించడం, ఉత్తరాంధ్రలో జాతీయ రహదారుల నిర్మాణంలో చొరవ చూపడం జరిగిందన్నారు. కావున ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాధవ్‌న గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకలు ఎల్.విక్రమ్, సబ్బి కుమార్‌స్వామి, వి.భవానీరుషి పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. దీనిలో భాగంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర నేతృత్వంలో మండల నాయకులు రమణరాజు ఆధ్వర్యంలో గ్రామగ్రామాల్లో పర్యటిస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. జనసైనికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రమాదవశాత్తు గాయపడిన వారికి ఆదుకునేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని రమణరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేగోవిందరావు 9వ వర్ధంతి

విశాలాంధ్ర - మునగపాక : స్వాతంత్ర సమర యోధుడు మాజీ శాసనసభ్యులు కోడుగంటి గోవిందరావు 9వ వర్ధంతి నాగులపల్లి సిపిఐ గ్రామ శాఖ నిర్వహించింది ఈ సమావేశంలో నాయుడు మల్లికార్జునరావు సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మారిశెట్టి వరాహ, శివ, నాగేశ్వరరావు, సూరిబాబు, నారాయణ రావు, జగదీశ్వరరావు, సత్యనారాయణ, రామచంద్రరావు తదితరులు పాల్గొని గోవిందరావు సేవలను కొనియాడారు గోవిందరావు చూపిన మార్గంలో నడవడమే ఆయన కు అర్పించే నిజమైన నివ్వాలని శ్రద్ధాంజలి ఘటించారు.

మోదీ విధానాలు అప్రజాస్వామికం : సీపీఐ

విశాలాంధ్ర - గాజువాక : ప్రధాని నరేంద్ర మోదీ విధానాలు అప్రజా స్వామికమని సీపీఐ ఆరోపించింది. 72 వ వార్డు సీపీఐ శాఖా సమావేశం చైతన్య నగర్‌లో శనివారం జరిగింది. సమావేశానికి సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజె.స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న దని, తద్వారా కార్మిక వర్గం, ప్రజ లందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్ట నెడుతూ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సంపదను ఆధాని, అంబానీ లాంటి వారు కొల్ల కొడుతున్నారని అన్నారు. బోగస్ కంపెనీలను తెరమీదకు తెచ్చి ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదేళ్లలో ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారని అన్నారు. బీజేపీ ప్రజా కంటక పాలనను సీపీఐ పోరాటాల ద్వారా అడ్డుకుంటుంది అని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా కేంద్రానికి బుద్ధి చేపు తామని హెచ్చరించారు. జి.ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ శాఖా కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి, నాయకులు జి.ఆనంద్, పొనగంటి భాస్కర్, పెంటకోట నర్సింగరావు, ఎం.రామారావు, మహిళా నేతలు కె.వి.కుమారి, అప్పారీ శ్రీలక్ష్మి, విల్లా సూర్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు : ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

విశాలాంధ్ర - పాయకరావుపేట/ పాయకరావుపేట రూరల్ : రాష్ట్రంలో రూ. 2లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని వెంకటనగరం, పాయకరావుపేటలలో వైసీపీ కన్వీనర్లు, గృహసారధులకు శిక్షణా కార్యక్రమం నిర్వ హించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లా డుతూ కన్వీనర్లు, గృహసారధులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కీలక బాధ్యతలు వహిం చాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలు, ప్రచారం, పథకాల్లో ప్రజ లను భాగస్వాములను చేయడం బాధ్యత తీసుకోవాలన్నారు. వైసీపీ పేద ప్రజల కోసం పుట్టిన పార్టీ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలతో సంక్షేమ పథకాలు అమల్లో అవినీతి చోటు చేసు కుందని తెలిపారు. ఎస్సీలుగా పుడతారా, బిసిల తోక కత్తిరిస్తా అని చంద్రబాబు అనడం ఎస్సీ, బిసీలను కించపరచడమేనని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఇతర పార్టీల నుండి వైసీపీలో ఎమ్మెల్యే గొల్ల బాబూ రావు సమక్షంలో చేరారు. మత్స్యకార కార్పో రేషన్ డైరక్టర్ చోడిపిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంకా సూర్య నారాయణ, నాయకులు ఇసరపు తాతా రావు, కోడా కోటేశ్వరరావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, నీలాపు మహేష్‌రెడ్డి, త్రిపర్ల సత్యనారాయణ, దేవవరపు వెంకటేశ్వర రావు, గూటూరు వెంకటేశ్వరరావు, యజ్జల సత్యనారాయణ, కొంకిపూడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాయక రావుపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ధనిశెట్టి బాబూ రావు, పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, గారా ప్రసాద్, జగతా శ్రీను, వడాల సోమన్నదొర, కేశనకుర్తి సత్తిబాబు, వేమగిరి లక్ష్మణరావు, పిరాధి రాజు, డొక్కుమళ్ల నానాజి తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లి కడుపు కోత బాధ్యత ఎవరిది

విశాలాంధ్ర - జీకేవీధి : కన్న తల్లి పిల్లలకు కడుపు కోత విధిస్తే ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో జీకేవీధి మండల గిరిజనులు ఉన్నారని, అదే విధంగా జీసిసి తీరు కనిపిస్తుందని గాలికొండ ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు అన్నారు. ఒక ప్రభుత్వ రంగ సంస్థ కావటం ఈ ఏడాది కాఫీ, చెర్రికి ముందస్తుగా కేజీ కాఫీ రూ.135 ప్రకటించడంతో రైతులు అందరూ జీసిసికి వేయాలని నిర్ణయం తీసుకుంటే జీసిసి కూడా ఒక ప్రైవేటు దలారి వలే 30కేజీల బస్తాకి, గోనెకు, కేజీ, తేమ శాతం, పేరుతో ఒక కేజీ, మూడు వందల గ్రాములు, అదనంగా తీసుకుంటే, రైతులకు మేలు చేస్తుందని చెప్పి మోసం చేస్తుందన్నారు. ఈ విషయాన్ని జీసిసి డిఎం, మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఎటువంటి స్పందన రాలేదన్నారు. దీనిపై కలెక్టర్ దృష్టిసారించాలన్నారు.

మత్స్యలింగేశ్వరుని దర్శించుకున్న ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - హుకుంపేట : శివరాత్రి సందర్భంగా మత్స్య గుండంలో మత్స్య లింగేశ్వరుని దర్శించుకొని ప్రత్యేక పూజలు అసిస్టెంట్ కలెక్టర్ ఆసుతోష్, సబ్ కలెక్టర్ అభిషేక్ అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ నిర్వహించారు. మత్స్యగుండంలో మత్స్యాలను (చేపలు) దర్శించుకొని అనంతరం మత్స్యలింగేశ్వర స్వామిని పూజించారు. అలాగే ఎమ్మెల్యే ఫాల్గుణ, వైకాపా నాయకులు మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకొన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు జాతరలో కలుసుకొని జాతర ఏర్పాటు, భక్తుల సౌకర్యం అధికారులు తీసుకొన్న జాగ్రతలు, భక్తుల ఇబ్బందులు తెలుసుకు న్నారు. జాయింట్ కలెక్టర్ అసుతోష్ జాతరలో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్ నీ పరిశీలించారు.అధికారులు, నాయకులు కుటుంబ సభ్యులతో మత్స్యగుండం వచ్చి పూజలు నిర్వహించటంతో భక్తులు, కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గట్టి బదోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ రాజలక్ష్మి, ఎంపీడీవో వెంకటరావు సిఐ సుధాకర్, ఎస్ ఐ సతీష్, స్థానిక సర్పంచ్ శాంతి కుమారి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ



విశాలాంధ్ర - యస్. రాయవరం : దళిత హక్కుల పోరాట సమితి డైరీ ను పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతులు మీదుగా ఆవిష్కరించారు. శనివారం మండలంలో కొరుప్రోలు గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిహెపిఎస్ రాష్ట్ర అధ్య క్షుడు జె.వి. ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబురావు కు నియోజకవర్గంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించాలని అభ్యర్థించారు. ఈ సంద ర్భంగా జె.వి. ప్రభాకర్ మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అసెంబ్లీ సమావేశాలు ఆమోదం చేయాలని, చట్టంలో ఉన్న కొన్ని అంశాలు దళితులకు ఉపయోగపడే విధంగా ఉండాలని అన్నారు. నక్కపల్లి మండల ఉద్దడపురం కేసు చార్జ్‌షీటు త్వరగా వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డాక్టర్ డిసిహెచ్. రాజు బాబు, జిల్లా అధ్యక్షుడు వడల శివప్రకాశ్ కార్యదర్శి వి. లోవరాజు, ఉపాధ్యక్షులు బందుల సుబ్బలక్ష్మి, కొండ్రు అప్పారావు, సహాయ కార్యదర్శులు జె.నాగరత్నం, యు.సత్తిబాబు, యస్. రాయవరం మండల నాయకులు, సమత సైనిక్ దల్ నాయకులు గార ప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీటీఆర్ఏ ఆధ్వర్యంలో వెయ్యి మందికి పులిహోర పంపిణీ

విశాలాంధ్ర - హుకుంపేట : మహాశివరాత్రి వేడుకను పురస్కరించుకుని ఎపి గిరిజన విలేకరుల సంఘం (ఎపిటిఆర్ఎ) ఆధ్వర్యంలో శనివారం వెయ్యి మంది భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. అల్లూరి జిల్లా మండలంలో ని మత్స్యగుండం, అద్దుమండలో ప్రతి సంవత్సరం జరిగే మహాశివరాత్రి వేడుకలకు పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. ఎపిటిఆర్ఎ గత కొన్నేళ్లుగా ఈ వేడుకలకు విచ్చేసిన భక్తులకు పులిహోర, ప్రసాదం, మంచినీరు ప్యాకెట్లు పంపిణీ చేస్తుండడం కొనసాగుతోంది. ఎపిటిఆర్ఎ ఏర్పడిన నాటి నుండి ఆ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహా శివరాత్రికి వచ్చే భక్తులకు పులిహోర పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఏటా జరిగే మహాశివరాత్రి వేడుకల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఎపిటిఆర్ఎను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఆర్ఎ సభ్యులు పి.దేముడు బాబు, సిహెచ్. రమణ, సూర్యారావు, దుర్గా, సునీల్, రాజారావు, జోషి, మహేష్, మోహన్, మత్స్యలింగం, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి ఉత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో బుడియాలు సందడి చేశారు. ఈనెల 20, 21 తేదీల్లో పాతసుజనకోట, గ్రామాల్లో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి ఉత్సవాలను జయప్రదం చేయాలంటూ ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండి నాగేశ్వరరావు కార్యదర్శి కూడా మోహన్ ప్రచార ర్యాలీని గ్రామ పెద్దలు ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు థింసా నృత్యలు, ఆటపాటలతో వారపు సంత అంతా మారు మ్రోగింది. బుడియాలు అంటే గంగమ్మ తల్లి మాలలు ధరించిన వారు ఒళ్లంతా సున్నంతో చారలుగా వేషధారణలు ధరించి వారం రోజుల పాటు గ్రామ గ్రామాల్లో తిరుగుతూ పండగపై ప్రచారం నిర్వహిస్తూ చందాలు వసూలు చేస్తారు. గంగమ్మ తల్లి పండగలో బుడియాలే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. పండుగకు ప్రజలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బాజ భజంత్రీలతో, బాణసంచా పేల్చుతూ నాలుగు రోడ్ల కూడలి మీదుగా మండల తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నుండి తిరిగి నాలుగురోడ్ల కూడలికి చేరుకొని అక్కడ నుండి బూడియాలు వారపు సంత లోపల వెళ్లి గంగమ్మతల్లి పేరు మీద వ్యాపారస్తులు వద్ద కానుకలు, నిత్యావసర సరుకులు, తీసుకుని అందులో మొదటి కానుక అమ్మవారికి సమర్పించుకుని మిగిలింది బుడియాలు తీసుకోవడం ఆనవాయితీ. గంగమ్మ తల్లికి మ్రొక్కుబడులు చేసుకొనే వారు బుడియా వేషధారణ చేస్తారు. దీంతో వారపు సంతకు వచ్చిన ప్రజలు బుడియాలను చూసేందుకు ఆసక్తి చూపారు. దీంతో సంత అంత బుడియాలతో మారుమ్రోగిపోయింది కార్యక్రమంలో కమిటీ సభ్యులు నీలకంఠం రాధాకృష్ణ వరుణ్ బాబు జగన్ గ్రామ పెద్దలు జగన్నాథం శంకర్రావు సదానందం గణపతి పూజారిలు రామ్మూర్తి త్రినాధరావు బుడియలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుక్షేత్రలో కొనసాగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం

విశాలాంధ్ర - పెందుర్తి : భారత వైదిక చరిత్రలోనే కనీవినీ ఎరుగని మహ యజ్ఞం కురుక్షేత్రలో నిర్వహిస్తుండటం గర్వకారణమని కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. శంకరాచార్య సంప్రదాయ పీఠాల్లో గుర్తింపు పొందిన విశాఖ శ్రీ శారదాపీఠం దీన్ని పర్యవేక్షించడం, అందులో పాల్గొనడం ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. కురుక్షేత్ర వేదికగా గుంతి ఆశ్రమం నిర్వహణలో చేపట్టిన శ్రీ లక్ష చండీ మహాయజ్ఞంలో శనివారం శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ స్వరూపా నందేంద్ర స్వామి పర్యవేక్షణలో యజ్ఞం పరిపూర్ణ మవుతుందని అన్నారు. అమ్మవారి ఆదేశం ఉంటే తప్ప ఇంత బృహత్తర కార్యక్రమం చేపట్టడం సాధ్యం కాదని తెలిపారు. యజ్ఞభూమిని సందర్శించినపుడు విశేష అనుభూతి పొందానని, ఖచ్చితంగా జీవితంలో ఎన్నో మార్పులు జరుగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపా నందేంద్ర స్వామి శ్రీ శారదా స్వరూప రాజశ్యామల, చంద్రమౌళీశ్వరుల పీఠార్చన నిర్వహించారు. అలాగే పది వేల సార్లు శివ పంచాక్షరీ హెూమాలను కూడా పూర్తి చేసారు. గుంతి మాతతో పాటు పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పది విద్యార్థులకు పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : ఇక్కడి మండలంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాల, బాలికల ఆశ్రమ పాఠ శాల, ప్రత్యూష గర్ల్స్ హెూమ్ అనాధా శ్రమంలో గల విద్యార్థులకు పెడ్, పెన్ను లను ఉచితంగా మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర ఏజెన్సీ ప్రెసిడెంట్ కే.కృష్ణకుమారి, అల్లూరి జిల్లా ప్రెసిడెంట్ ధర్మలు ఉచి తంగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై విద్యా ర్థులకు మనోధైర్యం ఇవ్వడంలో భాగంగా ఉచితంగా పెడ్, పెన్నులను పంపించడం జరిగిందన్నారు. అలాగే విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై పలు రకాల మెలకువలు కూడా అవగాహన పరచడం జరిగిం దన్నారు. అంతకుముందు విద్యార్థులు అందించే మెనూ పరిశీ లించారు. తమ వంతు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసు కోవడం ఎంతో సంతోషకరమైన విషయంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి సగస్ హెూమ్ అనాధ ఆశ్రమ నిర్వాహకులు వెంకటరావు ఆ సంఘం ప్రతినిధులు నాగేశ్వరరావు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

విశాలాంధ్ర - కోటవురట్ల : రాష్ట్రంలో సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న రాజారెడ్డి రాజ్యాం గాన్ని తరిమేసి అంబేద్కర్ రాజ్యాంగాన్ని పరి రక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని తెదేపా నాయకులు అన్నారు. శుక్రవారం మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం లో పర్యటిస్తుండగా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఈ చర్యకు నిరసనగా శనివారం రాట్నాల పాలెం లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతి పత్రం అందజేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. రాజ్యాంగాన్ని రక్షించవలసిన పోలీసులే ముఖ్యమంత్రికి వత్తాసు పలకడం సిగ్గుచేటు అన్నారు. జీవో నెంబర్ ఒకటిని అడ్డుపెట్టుకొని సైకో ముఖ్యమంత్రి రాష్ట్రంలో అరాచకాలను సృష్టించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు వేచలపు భాస్కరరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి సుంకర బాబ్జి, కోటవురట్ల టౌన్ పార్టీ అధ్యక్షులు కసిరెడ్డి ఏసు, తంగేటి శ్రీను, లోవరాజు, కైలాసపట్నం గ్రామ తెదేపా అధ్యక్షులు భీముని మాణిక్యాలరావు, సిద్ధాబత్తుల రాజారావు, అయ్యప్ప వివిధ గ్రామాలకు చెందిన తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

హర నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

విశాలాంధ్ర - కొయ్యూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు శైవ క్షేత్రాలు హర నామస్మరణతో మారుమోగాయి. మండలంలోని ప్రసిద్ధిగాంచిన కొయ్యూరు బ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు పెదమాకవరంలో దేవతలచే ప్రతిష్టించబడిన బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం, వలసంపేట సమీప గాదిగుమ్మి జలపాతం వద్ద వెలసిన గిరిజాతాండవేశ్వర స్వామి ఆలయం, మాకవరం విశాలాక్షి సమేత శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయం, చింతలపూడి ఉమా దార మల్లేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుండే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. కొయ్యూరు మల్లికార్జున స్వామి ఆలయం వద్ద వేలాదిగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎం వి వి ప్రసాద్ అనిశెట్టి చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో, అలాగే కాకరపాడు కు చెందిన కొప్పుశెట్టి కామేశ్వరరావు కుటుంబీకుల ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో మండలంలోని శైవక్షేత్రాలన్ని హరనామస్మరణతో మారుమ్రోగాయి.

రాజ్యాంగ హక్కులను పోలీసులు కాలరాస్తున్నారు : బుద్ధ నాగజగదీష్

విశాలాంధ్ర - అనకాపల్లి : శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీసులు ప్రజలకు వారి పట్ల నమ్మకం పోయే విధంగా జగన్ రెడ్డి ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తూ వారి విలువలను తగ్గించు కుంటున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పోలీస్ యంత్రాంగంపై విరుచుకు పడ్డారు. భారత దేశం రాజ్యముద్ర మూడు సింహా ధరించి రాజ్యాంగం నియమాలు పాటిస్తామని ప్రమాణం చేసి ఉద్యోగాల్లో చేరుతారని అటువంటి అధికారులు ఈరోజు జగన్ రెడ్డి ప్రభుత్వానికి శిరస్సు వంచి కొంతమంది అధికారులు పనిచేస్తున్నారని ఆ రాజ్య ముద్ర విలువలు నాశనం చేస్తున్నారని వైసీపీ కార్యకర్తల వ్యవహరిస్తున్నారని నాగ జగదీశ్ మండిపడ్డారు. జగన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఇదే పోలీసులపై పదే పదే ఆంధ్ర పోలీసులపై నమ్మకం లేదని వారిని అవమానించి దూషించారని అటువంటి వ్యక్తి పట్ల వారి ఉద్యోగ ధర్మాన్ని కూడా మరిచిపోయి ఊడిగం చేస్తున్నారని రాజకీయ పార్టీలకు రాష్ట్రంలో అన్నింటికీ పోలీసులు ఒకే విధమైన రూల్స్ రెగ్యులేషన్ ఉంటాయని అధికార పార్టీకి ఒకలాగా ప్రతిపక్షాలకు ఒకలాగా ఉండవని రాజ్యాంగం చెబుతున్న చట్టాన్ని అమలు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందుతున్నారని ప్రజల్లో వారి పట్ల విశ్వాసం కోల్పోతున్నారని ఇటీవల పరిణామాలు పరిశీలించినట్లయితే తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర లో అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తూ నాన్న యాగి చేస్తున్నారని అలాగే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రతిపక్ష నాయకులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పర్యటనలు చేస్తున్నప్పుడు జడ్ క్యాటగిరి లో ఉన్న వ్యక్తికి కల్పించ వలసిన రక్షణ చర్యలలో తూర్పుగోదావరి జిల్లాలో పర్యటనల్లో రక్షణ కల్పించవలసిన పోలీసులు అడ్డంకులు సృష్టించి చంద్రబాబు వాహనానికి ముందు పోలీసులు ధర్నా చేయడం ఒక డివిజనల్ స్థాయి అధికారి పోలీసులను కింద కూర్చొని ఆదేశాలు ఇవ్వడం పోలీసు వ్యవస్థకే కలంకమని మరి ఇంతలాగా దిగజారిపోయి అధికార పార్టీకి అడుగు మడుగులు ఒత్తుతున్నారని నాగ జగదీష్ మండి పడ్డారు. గతంలో ఏ ప్రభుత్వంలో పోలీస్ యంత్రా ఇంతలా దిగజారి పనిచేయ లేదని కొంతమంది అధికారులు వల్ల చెడ్డపేరు వస్తుందని తెలిసినప్పటికీ మంచి పేరున్న పోలీసు అధికారులు మౌనం పాటించడం ఎంత మాత్రం సమంజసంగా లేదని నాగ జగదీష్ ఆవేదన వ్యక్త పరిచారు. ఇకనైనా ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని పోలీసుల పట్ల నమ్మకం కలిగే విధంగా వ్యవ హరించాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలకై టఫె మాస్సే డైనాస్టార్ పోటీ 2023

విశాలాంధ్ర - విశాఖ సిటీ : వ్యవసాయరంగంలో కొత్త ఆలోచనలను, స్ఫూర్తివంత మైన పారిశ్రామిక తత్వాన్ని గుర్తించేందుకు మాస్సే డైనాస్టార్ - 2023 పోటీని ప్రారంభించినట్టు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ (టఫె) ఒక ప్రకటనలో తెలిపింది. మాస్సె ఫెర్గూసన్ డైనా ట్రాక్ ట్రాక్టర్తో విభిన్నంగా మీరు ఏం చేయగలరు? అనే ప్రశ్నకు సమాధానం చెప్పడంతో పాటు పోటీదారులు వ్యవసాయం కోసం వినూత్న పరిష్కారాలు, మెళు కువలు, వ్యవసాయ కోసం డైనాట్రాక్ వినియోగం, సమాజాన్ని విస్తృత స్థాయిలో రూపాంతరీక రించడం వంటి అంశాలపై తమ ప్రత్యేకమైన, వినూత్నమైన ఆలోచనను పది నిమిషాలకు మించకుండా పంపాలని సూచించింది. పోటీలో పాల్గొనేవారు మాస్సే ఫెర్గ్యూసోన్ ఇండియా డాట్ కామ్/డైనస్టార్ వెబ్సైట్లో రిజిస్టర్ కావాలని సూచించింది. ఎంఎఫ్ డైనాస్టార్ ట్రాక్టర్ గురించి నాలుగు ప్రశ్నలతో కూడిన క్విజ్లో సమాధానం చెప్పాలనీ, అక్కడ విజయవంతం అయితే వీడియో, టెక్ట్స్ రూపంలో తమ ఎంట్రీని దాఖలు చేయాలని పేర్కొంది. జ్యూరీ ప్యానెల్ 20 మంది పోటీదారులను ఎంపికచేసి అందులో నుంచి 10 మందిని ఫైనలిస్టులుగా ప్రకటిస్తుందని తెలిపింది. వారిలో నుంచి విజేతను ఎంపికచేస్తారని పేర్కొం ది. విజేతకు రూ.7.5 లక్షల విలువైన మాస్సే డైనాట్రాక్ ట్రాక్టర్ను అందజేస్తామని ప్రకటించింది. ఇద్దరు రన్నరప్ కు 8 గ్రాముల బంగారు నాణాలు, టాప్-20లో ఉన్నవారికి రూ. 5 వేల విలువ చేసే గిఫ్టులు ఇస్తామని తెలిపింది.

భక్తులకు భారీ అన్నసంతర్పన

విశాలాంధ్ర - దేవీపట్నం : మహా శివరాత్రి పర్వదినం ను పురస్కరించుకుని రంపచోడవరం మండలం లోని రంప గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న భక్తులందరికీ రంపచోడవరం భాను సప్లై అధినేత బత్తిన శ్రీనివాసరావు శనివారం భక్తులకు తమ వంతు గా భారీ అన్న వితరణ ను చేపట్టారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శివరాత్రి రోజు వచ్చిన భక్తులందరికీ అన్న సంతార్పణ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈరోజు సుమారు పదివేల మంది భక్తులకు అన్నసంతార్పణ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ రంప గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న ఎవరికైనా శివుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆయన అన్నారు, ఈ అన్న సంతర్పణ కార్యక్రమంలో సహకారం అందించిన ఆలయ కమిటీ సభ్యులు వివిధ శాఖలకు అధికారులు, సిబ్బంది,భాను సప్లై సిబ్బంది తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు,

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

విశాలాంధ్ర - కే కోటపాడు : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని అనేక శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. చౌడువాడ కే కోటపాడు శివాలయాలు , లక్ష్మీనరసింహస్వామి అప్పన్న ఆలయాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ దాట్ల శివాజీ రాజు రొ రొంగలి సూర్యనారాయణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో గోషించిన గోదావరి తీరం



విశాలాంధ్ర - దేవీపట్నం : గోదావరి నది తీరాన శైవ క్షేత్రాల్లో భక్తుల గోదావరి నదీ పవిత్ర స్నానాలు లతో పితృ కర్మలు బ్రాహ్మణ మంత్రోచ్చారణ లతో శివనామస్మరణతో గోదావరి నది తీరం శనివారం కోలాహలంగా మారింది.దేవీపట్నంలోని ఉమా చోడేశ్వర స్వామివారికి భక్తులు వేకువ జామునే గోదావరి నది లో పుణ్య స్నానాలు ఆచరించి రుద్రాభిషేకములు స్వామివారి కల్యాణంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు వచ్చిన భక్తులకు సుమారు ఐదు వందలమందికి అన్న సమారాధన కార్యక్రమం ను ఆలయ కమిటీ చేపట్టింది. ఇదిలా ఉండగా గుబ్బలం పాలెం గ్రామంలో వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం కమలం పాలెం వద్ద ఉన్న శివాలయంలో పెదభీం పల్లి లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం లోను భక్తులు విరివిగా పూజలు నిర్వహించారు.

మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో శివరాత్రి మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం సమీపంలో గల పెద్దమిల్లు జంక్షన్ వద్ద గల వామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి ఆలయం, పిపి.అగ్రహారంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తాం : ఎస్ఐ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర - నాతవరం : ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ను పక్కాగా అమలు చేస్తామని నాతవరం ఎస్సై డి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎక్కడా ప్రచారాలు, వాల్ పోస్టర్లు, జెండాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు : తహశీల్దార్ కనకారావు

విశాలాంధ్ర - నాతవరం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నాత వరంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1588 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. స్థానిక ఎంపిపి స్కూల్లో 177, 178 నెంబర్లతో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం



విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆరోపించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అనపర్తిలో జరిగిన కార్యక్రమాన్ని పోలీసులు అడుగడుగునా అడ్డు తగలడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పాయకరావుపేటలో టీడీపీ నాయకులు నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అన్ని అనుమతుల కార్య క్రమంలో పాల్గొన్న చంద్రబాబును అనుమతులు లేవని అడ్డుకోవడం పోలీసులు ప్రభుత్వం కనుసన్నల్లో పనిచేస్తున్నారనటంలో ఎటువంటి అనుమానాలు లేవన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు మల్లపురెడ్డి రమాకుమారి, చింతలపు ప్రదీప్, బొంది కాశీవిశ్వనాద్, చింతకాయల రాంబాబు, వల్లా విలియం కేరి, లెక్కల గోవిందునాయుడు, సూరా సుబ్రమణ్యం, గారా కృష్ణ ప్రసాద్, కట్టా శ్రీను, జూరెడ్డి ప్రసాద్, రావాడ గోవిందరెడ్డి, కె.సురేష్రెడ్డి, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, పిన్నింటి సూరిబాబు, ఏడిద సురేష్, కుందూరు కుమార్, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జడేరు'లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - దేవీపట్నం : రామ కృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల రాజమహేంద్రవరం వారిచే, గంగవరం మండలం జడేరు గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చలానందజీ మహారాజ్ తెలియ చేశారు, ఈ వైద్య శిబిరం లో సుమారు వంద మంది రోగులకు డాక్టర్ శ్రీనివాస్ రాయుడు వైద్య సేవలు అందించారు. 25 మందికి రక్త పరీక్షలు, ఒకరికి ఇసిజి చేసినట్లు స్వామీజీ తెలిపారు, ఈ వైద్య శిబిరం లో రామకృష్ణ మిషన్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పార్వతి పరమేశ్వరుల కళ్యాణం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డిగూడెం గ్రామంలోని అతి పురాతన దేవాలయం నందు వెలసియున్న శ్రీ సతి పార్వతి రుద్ర కోటేశ్వర స్వామి వారిని మహాశివరాత్రి సందర్భంగా దర్శించుకుని పూజలు నిర్వహించేందుకు ఉదయము నుండే భక్తులు బారులు తీరారు. పార్వతీ పరమేశ్వరుల తిరు కళ్యాణ మహోత్సవం శనివారం రాత్రి 10 గంటల ఐదు నిమిషాలకు అంగరంగ వైభవంగా విద్యుత్ దీపాలంకరణ లతో వేద పండితుల మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్యాలు నడుమ భక్తజన సందోహం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణాన్ని కనులారా తిలకించేందుకు తరలివచ్చే భక్తజనులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ వారు తగు ఏర్పాటు చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మం ప్రచారంలో భాగంగా ధర్మ ప్రచారక్ రామకృష్ణయ్య, సబ్ డివిజన్ కన్వీనర్ నోముల శ్రీనివాసరావు గ్రామ సహాయ కన్వీనర్ ముత్యాల సత్యనారాయణ భక్త జనులందరికీ కరపత్రాలను పంచడం నిర్వహించారు.

విశాఖ సాగర్ తీరంలో శివరాత్రి కళ....

బీచ్ రోడ్లో కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : లోకానికి వెలుగులు నింపే ఆ పరమశివుడ్ని శివరాత్రి పర్వదినము రోజు దర్శించుకుంటే అంతకు మించిన ముక్తి దాయకం మరొకటి ఉండదని నమ్మకం కలిగిన భక్తులు లక్షలాదిమంది విశాఖ సాగర తీరానికి తరలి వచ్చారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం బీచ్ రోడ్ లో మాజీ ఎంపీ డాక్టర్ టి సుబ్బరామిరెడ్డి సేవా పీఠం ఏర్పాటు చేసిన కోటి శివలింగాలకు మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పలువురు సినీ తారలు, నటీనటులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని శివరాత్రి వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులతో కలిసి స్వయంగా శివలింగానికి వీరు అభిషేకం నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా బీచ్ రోడ్ లో కోటి శివలింగాలని ఏర్పాటు చేసి భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించడం ఆనందదా యకమని సందర్శకులు తెలియజేశారు. అంతే కాకుండా ప్రత్యేక తీర్థ మహోత్సవం ఏర్పాటు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, జాగరణ చేసే భక్తులకి ఎంతగానో దోహదం చేస్తాయి అని ఇవి అత్యంత అభినందనీయమన్నారు. సృష్టిలో శివ దర్శనాన్ని మించింది మరోటి లేదన్నారు. రాముడు, కృష్ణుడు సైతం ఆ పరమశివుని పూజించిన ఘట్టాలు పురాణాల్లో నేటికీ మనకు చరిత్రలో ఉన్నాయన్నారు. పరమశివుడి అవతరణే శివరాత్రిగా భక్తులంతా భావిస్తారన్నారు. అటువంటి మహి మాన్వితమైన శివుడిని శివరాత్రి రోజు దర్శించుకుని ప్రజలంతా ముక్తిని పొందాలని ఈ సందర్భంగా భక్తులు అభిప్రాయపడ్డారు. మరోపక్క వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రాల నుంచి తరలివచ్చిన పర్యాట కులు సాగర తీరంలో శివరాత్రి శోభ ను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. భక్తజనం, సందర్శకులతో సాగర తీరం కిటకిటలాడింది. అనేక ప్రాంతాల నుంచి భక్తులు రాత్రంతా సాగర తీరంలో ఇసుకపై జాగారం చేసి తెల్లవారుజామున సముద్ర స్నానాలు చేసి శివాలయాలను సందర్శించుకుంటారు.

బాదంతో మధుమేహ ప్రమాద కారకాలు తగ్గే అవకాశం

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రతి రోజూ బాదంపప్పును 12వారాల పాటు తినడం వల్ల ఇన్సులిన్ ప్రతిరోధకత తగ్గడంతో పాటుగా పాన్క్రియాటిక్ పనితీరు మెరుగుపడటం, బ్లడ్ గ్లూకోజ్ స్థాయి నియంత్రణలో సహాయపడుతుందని నూతన అధ్యయనం వెల్లడించింది. బాదములు తిన్నవారిలో శరీర బరువు తగ్గడం, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) తగ్గడం, నడుం చుట్టు కొలత తగ్గడం వంటివి చూడటంతో పాటుగా తమ కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం తగ్గించుకోవడం కనిపించింది. చెన్నైలోని మద్రాస్ డయాబెటీస్ రీసెర్చ్ ఫౌండేషన్ వద్ద చీఫ్ ఆఫ్ డయాబెటీస్ రీసెర్చ్ అధ్యక్షులు విశ్వనాథన్ మోహన్ నేతృత్వంలో ఆర్ ఎం అంజన, రిచార్డ్ మ్యాట్స్ సహకారం తో పరిశోధకులు 43 గ్రాములు (1.5 ఔన్సులు) ముడి బాదములను ప్రతి రోజూ 12 వారాల పాటు తినడం వల్ల ఇన్సులిన్పై కలుగుతున్న ప్రభావం, ఇన్సులిన్ రెసిస్టెన్స్, సెరమ్ లిపిడ్ మార్కర్లను ఆసియన్ భారతీయ పురుషులు మరీ ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్న వారిలో పరిశోధించారు. బాదముల వినియోగదారులలో శరీర బరువుతో పాటుగా బ్లడ్ షుగర్ కూడా మెరుగుపడింది" అని డాక్టర్ మోహన్ అన్నారు. బాదములు వల్ల గుండె ఆరోగ్యం సైతం మెరుగుపడుతుందని పరిశోధకులు గుర్తించారు.

వేడుకగా వేపగుంట శ్రీఅభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం అత్యంత భక్తి ప్రపత్తులతో జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి యతి రాజుల నాగేశ్వరరావు, పశ్చిమ నియోజక వర్గం వైసీపీ ఇన్చార్జి ఆడారి ఆనంద కుమార్ సహా పలువురు ప్రముఖులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త బుద్ధ శివాజీ, నాయకులకు స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఏపీలో రాజ్యంగ ఉల్లంఘన : మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర - పాడేరు : దేశంలో ఎక్కడా లేని విధంగా మూడున్నరేళ్ల నుంచి ఆంధ్రప్రదేశ్లో అడుగడుగున రాజ్యాంగ ఉల్లంఘన, చట్టాల ధిక్కరణ జరుగుతోందని టిడిపి పాడేరు నియోజక వర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. అనపర్తి నియోజకవర్గం లో చంద్రబాబు నాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకోవడం కార్యకర్తలపై లాఠీచార్జి చేయడానికి నిరాసిస్తూ ప్రతి నియోజక వర్గంలో నిరాశన కార్యక్రమం చేయాలని తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు శనివారం పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాశన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం, ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని కాలరాస్తూ సామాన్య ప్రజల నుంచి ప్రతిపక్ష పార్టీ నేతల వరకు అందరిని వేధింపులకు గురి చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులతో వేధిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా జీవో నెం. 1 తెచ్చి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రతి పౌరునికి భావ ప్రకటనా స్వేచ్ఛ ఉందని అన్నారు . కానీ వైసీపీ పాలనలో మాత్రం రాష్ట్రంలో ప్రజలు కనీసం నోరు తెరచి తమ అభిప్రాయాన్ని చెప్పలేని దుస్థితి నెలకొందన్నారు. ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు నిర్వ హించకుండా పోలీసులు చేత అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు . శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసుల చేత శాంతి భద్రతలకు విఘాత ఇటువంటి చర్యలతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమా దంలో పడిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి రాష్ట్ర ప్రభుత్వంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గబ్బాడా సింహాచలం, ఐ టిడిపి ఇంచార్జి బుద్ధ జ్యోతి కిరణ్, పాడేరు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు బుక్క జగదీష్, పాడేరు మండల తెలుగు యువత అధ్యక్షులు దుంబేరి విశ్వనాధం, పాడేరు మండల ఎస్టీ సెల్ కార్యదర్శి కబిడి శివ శంకర్, డప్పొడి వెంకట రమణ, కుడుములు కోటిబాబు, శ్రీను, కూడా రాజేష్, పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసి కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అనంత శంకర్తో కలసి జోడుగుళ్లపాలెం నుండి రాడిసన్ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జి - 20 సదస్సుకు దేశ విదేశాల నుండి దాదాపు 200 మంది అతిథులు వస్తున్నారని వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు, అటవీశాఖకు సంబంధించిన స్థలాలలోని పనులు అటవీ శాఖ అధికారుల అనుమతితో నిర్ణీత కాలంలోపు పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు పని గంటలు పనిచేసి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్స్, విద్యుత్ దీపాలంకరణ,పెయింటింగ్ పనులు సుందరీకరణలో భాగంగా వచ్చుదనాన్ని పెంపొందించడం, మొక్కల ట్రిమ్మింగ్, ఇంజనీరింగ్ పనులు త్వరతగతిన చేపట్టాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాలలో బీచ్ అభివృద్ధి పనులు సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు చిల్లర వ్యాపారులు ఒక క్రమ పద్ధతిలో వ్యాపారం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ వై శ్రీనివాసరావు, సబ్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ ధర్మరక్షిత్, చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్, డిడిహెచ్ ఎం దామోదర రావు, జోనల్ కమీషనర్ కనకమాలక్ష్మి పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంసన్ రాజు, ఏఎంఓహెచ్ డాక్టర్ ఎస్ కిషోర్,, డీసీపీ పద్మజ, ఇపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, జివిఎంసి కార్యనిర్వాహక ఇంజనీర్ మత్యరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్గా సినీనటుడు జోగినాయుడు

విశాలాంధ్ర - నాతవరం : సినీ నటుడు జోగినాయుడు సేవలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కల్చర్ కమిషన్ క్రియేటివ్ హెడ్గా నియమిస్తూ ఉఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం చెర్లోపాలెం గ్రామానికి చెందిన జోగినాయుడు దాదాపు 150కి పైగా సినిమాల్లో నటించారు. దర్శకుడు పూరీజగన్నాథ్తో బంధుత్వం ఉన్న ఈయన రాష్ట్ర విభజన అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఎన్నికల ప్రచారాల్లో చురుగ్గా పనిచేసారు. తన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఈ పదవిని ఇచ్చారని, రెండేళ్ల కాలపరిమితితో కూడిన ఈ పదవిని సద్వినియోగం చేసుకొని మరిన్ని సేవలను అటు సాంస్కృతిక శాఖకు, ఇటు పార్టీకి అందిస్తానని చెప్పారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించడంపై సీఎం జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా జోగినాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ నాయకులు నిరసన

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలోని పెదగు ముల్మారు గ్రామంలో టిడిపి నాయ కులు నిరసన వ్యక్తం చేశారు. మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు సభను అడ్డుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. వినోద్ రాజు, టిడిపి సీనియర్ నాయకులు కందుల వేంకటేశ్వర రావు, గుర్రం రామకృష్ణ, కురందాసు శ్రీనివాస్, కోన అప్పలరాజు, ప్రగడ తులసి, పోలిశెట్టి శ్రీను, గుండుబోలు గోవిందరావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

శివనామముతో మారుమోగిన శివాలయాలు

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనంద పురం మండలంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్క రించుకొని పలు శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. మండలంలోని ఆనందపురం, పొడుగు పాలెం, గుడిలోవ, గిడిజాల ,కణమాం పంచాయతీ అరిగిమేరక సొం ట్యాం గ్రామాలలో ఉన్న శివాలయాలు తెల్లవారు జాము నుండి భక్తులతో కిటకిటలాడాయి. శనివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. పొడుగు పాలెం లో ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గుడిలో వ లో ఆలయ చైర్మన్ కోరాడ గిరిరాజు, డైరెక్టర్ చందల అప్పలరాజు, భక్తులకు పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. కనమాం పంచాయితీ అరిగిమేరకలో స్థానిక యువ నాయకుడు పినిశెట్టి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల జన సంద్రోహంతో, భజనలు పూజలు మధ్య శివాలయాలు శివనామంతో మారుమోగాయి.

చోడవరం : అత్యంత భక్తి శ్రద్ధలతో కళ్యాణ మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వేకువజాము నుండి చోడవరం లోని స్వయం భూ శ్రీ పురాణ గౌరీశ్వర స్వామి దేవస్థానంలో మహాన్యాస పూర్వక రుద్ర సహిత పంచామృత అభిషేకములు జరిపించారు. రాష్ట్రం లోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్విత పురాణ చరిత్ర ప్రసిద్ధి గాంచిన స్థానిక గౌరీశ్వర సన్నిధిలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజలు, జాగరణ, లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ కార్య క్రమంలో ఈ.ఓ.ఎస్. వి.వి.సత్యనారాయణ మూర్తి, చైర్మన్ గూనూరు సత్యనారయణ, ప్రధాన అర్చకులు కొడమంచిలి వెంకటరావు, చలపతిరావు, శ్రీనివాస్, సంగీసా మహేష్, విఘ్నేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో సోమలింగేశ్వర స్వామి, వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, గవరవరం, లక్కవరం, జుత్తాడ, భోగాపురం, రాయపురాజు పేట, భోగాపురం తదితర గ్రామాల్లో మహా శివరాత్రి, పూజలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి శేష అశోక్, సెక్రటరీ పుట్టా నరేష్, ట్రెజరర్ భోగవిల్లి గణేష్, కలగర్ల శేషగిరిరావు పాల్గొన్నారు.



అనంతగిరి : మండలంలో ఉన్న ప్రముఖ శివాలయాలు శివనామస్మరణతో శనివారం మార్మోగాయి ప్రముఖ పర్యట కేంద్రమైన బొర్రా గుహల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగింది గృహలోపల కొలువై యున్న శివుని దర్శించుకున్నందుకు ఒడిస్సా రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు శు క్రవారం చేరుకున్నారు శనివారం ఆలయం భక్తులతో కిటికీటలాడింది కాశీపట్నం గ్రామంలో కొలువై ఉన్న ఉమాలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కలకల్లాడింది తెల్లవారుజాము నుంచి భక్తులు తాకిడి ఆలయానికి పోటెత్తింది విజయనగరం విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయం వద్దకు తెల్లవారుజామున చేరుకున్నారు సమీపంలో ఉన్న గోస్తని వద్ద పుణ్య స్నానం ఆచరించి శివుని దర్శించుకున్నారు దర్శనం కోసం భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు పలు సంస్కృతి కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి

చింతూరు : మండలంలోని చింతూరు,కుంట, చట్టి వీరాపురం గ్రామంలో గల శివాలయంలో శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో శివనామ స్మరణతో మారుమోగాయి. చట్టి లో వెలిసిన గాదే రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. గిరిజన ప్రాంతంలో వెలిచిన గాదే రామలింగేశ్వర శివాలయ%శీ% ప్రసిద్ధి చెందినదని ఆ స్వామి తీర్చుతాడని ఇ క్కడ పెద్దలు చెప్పుంటారు.ఈ . ప్రతి ఏటా భక్తులకు భద్రాచలం పట్టణానికి చెందిన పసుపులేటి రామకృష్ణ, ఎడ్లపల్లి రామారావు, శ్రీ రెడ్డి సతీష్ కుమార్ సుమారు 5వేల మంది భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. చింతూరు సంత మార్కెట్ లో గల శివాలయంలో అర్చకులు ఉమామహేశ్వర శర్మ, ప్రసాదు శర్మ ప్రత్యేక పూజలు ,అభిషేకాలు నిర్వహించారు. కుంట శివాలయంలో ఘనంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ తిరుణాలను ప్రారంభించారు. తిరుణాల్లో జెయింట్ వీల్, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రథమ చికిత్సలు నిర్వహించదానికి డియం అండ్ హెచ్ ఒ పుల్లయ్య ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి భక్తులకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా సిఆర్పిఎఫ్ సిబ్బంది తో భద్రతా ఏర్పాట్లు చేశారు.